

గద్దె వద్ద గ్రామ దేవతలు

# ఘనంగా ఊర పండుగ



- నగరంలో గ్రామ దేవతలకు ఘనమైన పూజలు
- మొక్కులు తీర్చుకునేందుకు పోటెత్తిన భక్తులు
- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జూలై28: నగరంలో ఊర పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాడి పంటలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని సర్వసమాజ్ ఆధ్వర్యంలో ప్రతీయేడు నిర్వహించే ఊరపండుగకు భక్తులు నీరాజనం పలికారు. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో ఖిల్లా ప్రాంతం జనసంద్రమైంది. ఖిల్లాలోని శారదాంబగద్దె వద్ద తెల్లవారు జామున నుంచే గ్రామ దేవతలు కొలువుదీరగా భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, ఆభరణాలతో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలుచేశారు. దేవతా మూర్తులను ఊరేగింపుగా ఖిల్లా చౌరస్తా నుంచి గాజుల్‌పేట్ చౌరస్తా మీదుగా పెద్దబజార్ వరకు వచ్చి అక్కడి నుంచి రెండు బృందాలుగా విడిపోయి నల్లపోచమ్మ, పౌడాలమ్మ, అడెల్లి పోచమ్మ, పులిరాట్నం దుబ్బవైపు వెళ్లగా, మరో బృందం సిర్నాపల్లి గడీ, గోల్ హనుమాన్ చౌరస్తా, వినాయక్‌నగర్ వద్ద గల ఐదు చేతుల పోచమ్మ, మత్తిడి పోచమ్మ, మహాలక్ష్మమ్మలతో ఊరేగింపుగా పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో తీసుకెళ్లారు. కొన్ని దేవుళ్లను ఎల్లమ్మగుట్ట, కంఠేశ్వర్ ప్రాంతాలకు తీసుకెళ్లారు. గాజుల్‌పేట్ వద్దనరి ఉంచే ప్రాంతం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నరి కోసం భక్తులు పోటీ పడటంతో తోపులాట జరిగింది. పోలీసులు వారిని చెదరగొట్టి ఉత్సవ విగ్రహాలను ముందుకు తరలించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే తొట్టెలను ఊరేగించడం సాంప్రదాయంగా వస్తోంది. ఈ తొట్టెల కింది నుంచి వెళితే శుభం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. దీంతో చిన్నపెద్ద తేడా లేకుండా భక్తులు తొట్టెల కింద నుంచి వెళ్లేందుకు పోటీ పడ్డారు.

### గ్రామ దేవతలను దర్శించుకున్న నాయకులు

ఊర పండుగ సందర్భంగా నగరంలోని ఖిల్లా ప్రాంతంలో ప్రతిష్ఠించిన గ్రామ దేవతలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలుచేశారు. నగర ప్రజలను అమ్మవారు చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామదేవతలను దర్శించుకున్న వారిలో సర్వసమాజ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు రత్నాకర్, రామర్తి గోపి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్ ఉన్నారు.





విగ్రహాలతో ఊరేగింపునకు వెళ్తూ..



పోతరాజుల విన్యాసాలు



అమ్మవార్లను దర్శించుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే, నాయకులు



గద్దె వద్ద భక్తుల సందడి

# నామినేటెడ్ పోస్టుల భర్తీలో కదలికలు!



- బోధన్, కమ్మర్‌పల్లి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపిక దాదాపు ఖరారు
- వారం రోజుల్లోపు ప్రకటించే అవకాశం
- ఆగస్టు మొదటి వారంలో మిగతా కమిటీ చైర్మన్ల నియామకం

నిజామాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నామినేటెడ్ పోస్టులో నియా మకంలో కదలిక మొదలైంది. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకానికి కసరత్తు కొనసాగుతోంది. వారంరోజుల్లోపు కొన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లను ప్రకటించనుండగా మరికొన్ని చైర్మన్లను 15 రోజుల్లోపు ప్రకటించేలా ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ల, డైరెక్టర్ల నియామకం ఖరారుకాగా, మిగతా నాలుగు మార్కెట్ కమిటీల చైర్మన్ల ఎంపిక కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి చేసిన సేవల ఆధారంగా ఈ పదవులను ఇచ్చేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. కీలకమైన అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలు కావడంతో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల ద్వారా పదవుల కోసం ప్రయత్నాలను చేస్తున్నారు.

### ● పాలకవర్గాల నియామకానికి కసరత్తు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌కమిటీల పాలకవర్గాలను నియమించేందుకు సిద్ధమైంది. జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటికి కొత్తగా పాలకవర్గాలను నియమించేందుకు కసరత్తు కొనసాగిస్తున్నారు. ఈనెలాఖరులోపు బోధన్, వేల్పూర్, కమ్మర్‌పల్లి మార్కెట్‌కమిటీలకు కొత్త చైర్మన్లను, డైరెక్టర్లను నియమించనుండగా మిగతా మార్కెట్‌లకు ఆగస్టు మొదటివారంలో నియమించేలా ఏర్పాట్లను చేస్తున్నారు. బోధన్, వేల్పూర్, కమ్మర్‌పల్లి కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఇతర నేతల సిఫారసు మేరకు వీరిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మూడు కమిటీల పాలకవర్గాల నియామకం ఈనెలాఖరులోపు చేయనుంది. ప్రభుత్వం తరపున ఉత్తర్వులను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెటింగ్ శాఖకు చైర్మన్లతో పాటు డైరెక్టర్లకు సంబంధించిన వివరాలను పంపించారు. ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులను జారీ చేయనున్నారు. ఇవేకాకుండా నిజామాబాద్, ఆర్మూర్, వర్ని, కోటగిరి మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకం ప్రక్రియ ఆగస్టు మొదటి వారంలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం ఎమ్మెల్యే భూపతిరెడ్డి కొన్ని పేర్లను సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కసరత్తు కొనసాగగా మిగతా నియోజకవర్గాల నుంచి అభ్యంతరాలు ఉండటంతో వాటిని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అది పూర్తికాగానే జిల్లాలో అతిపెద్దదైన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించనున్నారు. మిగతా మూడింటిని కూడా జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలు సిఫారసు చేసిన వారికి పదవులను కట్టబెట్టనున్నారు. ఈ మార్కెట్ కమిటీల పాలకవర్గాలతోపాటు ఇతర పాలకవర్గాలను కూడా నియమించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అతికీలకమైన నుడా చైర్మన్‌ను నియమించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. నగర శివారు అభివృద్ధి అంతా నుడాపై ఆధారపడి ఉండటంతో కీలకమైన వ్యక్తినే చైర్మన్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కూడా నియామకం చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నేతల జాబితాను ఈ పదవుల కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తమ ఎమ్మెల్యేల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్ల పాటు పార్టీలో ఉండి పనిచేసిన నేతలకు జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. ఎవరికి పదవులు వస్తాయో ఏ నేతకు కీలకమైన పదవిని కట్టబెడుతారో వారం రోజుల్లో తేలనుంది.

# పెరుగుతున్న సాగు విస్తీర్ణం!



- జిల్లాలో గణనీయంగా పెరుగుతున్న పంటల సాగు
- ఇప్పటివరకు 4లక్షల 51,643 ఎకరాల్లో పంటలను సాగు
- జిల్లాలో ఎక్కువ మొత్తంలో వరిసాగుకే మొగ్గు చూపుతున్న రైతులు

నిజామాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు నాల్గున్నర లక్షల ఎకరాలకు పైగా సాగువిస్తీర్ణం పెరిగింది. ప్రతీరోజు రైతులు పంటలసాగు కొనసాగిస్తుండటం వల్ల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. వ్యవసాయ శాఖ వేసిన అంచనాల ప్రకారం ఈయేడు పడుతున్న వర్షాలతో పెరుగుతుందని భావిస్తున్నారు. ఈయేడు కూడా రైతులు ఆరుతడి పంటలను తగ్గిస్తూ వరిసాగునే ఎక్కువగా కొనసాగిస్తున్నారు. పసుపుకు డిమాండ్ ఎక్కువగా ఉన్న అదే రీతిలో రైతులు సాగును పెంచలేదు. సోయా పంటను తగ్గించిన రైతులు మొక్కజొన్న సాగును పెంచారు. మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో ఎక్కువగా రైతులు ఈ పంటను వేస్తున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యంకు బోనస్ ప్రకటించడం వల్ల జిల్లాలో 65 శాతంకు పైగా రైతులు ఈ వానాకాలంలో సన్నాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రతీరోజు ఈ సాగు విస్తీర్ణం పెరుగుతుండటం వల్ల అధికారులు కూడా కావాల్సిన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలోపు నిర్ణయించిన లక్ష్యానికంటే ఎక్కువ మొత్తంలోనే పంటల సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఆరుతడి వైపు మొగ్గు

జిల్లాలో పంటల సాగుభారీగా పెరుగుతోంది. ఈ వానాకాలంలో జిల్లాలో 5లక్షల 52,128 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనావేశారు. జూన్‌లో వర్షాలు ఎక్కువగా లేకపోవడంతో రైతులు ఆరుతడి పంటల సాగుకే మొగ్గుచూపారు. జూలై ఆరంభం నుంచి ఇప్పటివరకు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో వరిసాగు కొనసాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల పరిధిలో ఈపంటల సాగు చేయడం వల్ల ఇప్పటివరకు 4లక్షల 51,643 ఎకరాల్లో పంటలను సాగుచేశారు. ప్రతీరోజు పది నుంచి పన్నెండువేల ఎకరాల వరకు వరి విస్తీర్ణం పెరుగుతోంది. ఏకదాటిగా పడుతున్న వర్షాలతో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ముందే



నారు పోసి ఉంచడం వల్ల వర్షాలకు ఎక్కువ మొత్తంలో వరినాట్లను వేస్తున్నారు. జిల్లాలోని కూలీలతో పాటు నల్గొండ, బీహార్, ఒరిస్సా, యూపీ కూలీలతో వరినాట్లను కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3లక్షల 5వేల ఎకరాల వరకు వరిసాగు అయ్యింది. జిల్లాలో మెజార్టీ రైతులు ఎక్కువ మొత్తంలో ఈ వరిసాగును కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ రూ. 500 క్వింటాకు ప్రకటించడంతో ఎక్కువ మంది ఆ రకాలను వేస్తున్నారు. జిల్లాలో సాగయ్యే మొత్తం వరి విస్తీర్ణంలో 65శాతం వరకు ఈ సన్నరకాలనే వేస్తున్నారు. ఈవానాకాలంలో ఎక్కువరోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో సన్నరకాలు వేసిన ఇబ్బంది ఉండదని రైతులు సాగు కొనసాగిస్తున్నారు. యాసంగిలో నీటి కొరత ఉండటం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల అప్పుడు తక్కువగా వేస్తూ దొడ్డురకాలను సాగు చేస్తున్నారు. సన్నరకాలకు ఎక్కువగా నీళ్ల అవసరం ఉండటం, ఎక్కువ రోజులు పంట ఉండటం వల్ల రైతులు వనాకాలంలోనే ఎక్కువ మొత్తంలో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రాజెక్టుల్లో, చెరువుల్లో నీళ్లు ఉంటే యాసంగిలోనూ అదేరీతిలో ఈ సన్నరకాలను సాగు చేయనున్నారు. జిల్లాలో నిర్ణయించిన లక్ష్యం ప్రకారం వరి 4 లక్షల 30వేల ఎకరాల వరకు సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాకు వస్తున్నారు. శ్రీరాంసాగర్‌లో నీటిమట్టాలు పెరుగుతుండటం వల్ల గుత్ప, అలీసాగర్ ఆయకట్టు పరిధిలో కూడా ఈ సాగు ఎక్కువ అవుతుందని అంచనాకు వస్తున్నారు.

### వరితోపాటు మొక్కజొన్నకు ప్రాధాన్యం

జిల్లాలో ఈసంవత్సరం కొన్నిరకాల పంటలను రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. వరితోపాటు మొక్కజొన్నకు ప్రాధాన్యతనిచ్చారు. గడిచిన కొన్నేళ్లుగా సోయా దిగుబడి రాకపోవడం వర్షాలు ఎక్కువగా పడటం వల్ల పంట దెబ్బతినడంతో రైతులు తగ్గిస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 51,478 ఎకరాలు సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా కేవలం 34,718 ఎకరాల్లోనే ఈ పంటను వేశారు. జిల్లాలో మొక్కజొన్న పంటకు ఎక్కువగా రైతులు మొగ్గు చూపారు. ప్రభుత్వ మద్దతు ధరతోపాటు బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు ఎక్కువగా ధర వస్తుండటం వల్ల రైతులు సాగు చేస్తున్నారు. కోళ్ల పరిశ్రమ, బీరు ఫ్యాక్టరీల యజమానులు, లిక్కర్ ఫ్యాక్టరీల యజమానులతోపాటు బిస్కెట్ ఫ్యాక్టరీల యజమానులు ఎక్కువగా కొనుగోలు చేస్తుండటం వల్ల రైతులు ఈ పంటల సాగును పెంచారు. జిల్లాలో 42,640 ఎకరాల్లో ఈ పంటను వేశారు.

### తగ్గుతున్న పసుపు సాగు

పసుపునకు భారీగా ధర పెరిగినా జిల్లాలో అనుకున్న విధంగా సాగువిస్తీర్ణం ఎక్కువగా పెరగలేదు. జిల్లాలో ఒకప్పుడు 50వేల ఎకరాలకుపైగా పసుపు సాగు కాగా ప్రస్తుతం 24,662 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటను వేశారు. గత సంవత్సరం కంటే 5వేల ఎకరాల్లో ఈ పంట పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రైతులు వేయలేదు. సంవత్సరం పాటు పంట సాగుచేయవల్సి ఉండటం పంట చేతికొచ్చే సమయంలో కూలీల కొరత ఎక్కువగా ఏర్పడటం, ఉడకబెట్టడం, తదితర సమస్యలు ఉండటం వల్ల రైతులు ఈ పంట సాగును ఎక్కువగా చేయడం లేదు. ఈ పంటలతో పాటు కంది, పెసర, మినుముల సాగుతో పాటు కొంతమేర కూరగాయల సాగును రైతులు వేశారు. జిల్లాలో పంటల సాగు పెరుగుతుందని అన్ని మండలాల్లో పరిశీలిస్తూ కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. పూర్తిస్థాయిలో ఎరువులు, మందులను అందుబాటులో ఉంచామన్నారు. ఆగస్టు మొదటి వారంలోపు వరిసాగు మరింత పెరుగుతుందని ఆయన తెలిపారు.



పంచ్ విసురుతున్న నిఖత్ జరీన్



విజయానందం ప్రదర్శిస్తున్న నిఖత్ జరీన్

# నిఖత్ ఫస్ట్ పంచ్ అదుర్స్

● ఒలంపిక్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేసిన నిఖత్ జరీన్

సుభాష్‌నగర్, జూలై 28: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ ఒలంపిక్స్‌లో తన సత్తా చాటింది. రౌండ్ 32లో తన విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రౌండ్‌లో కొద్దిగా తడబడ్డ నిఖత్‌జరీన్ తర్వాత రెండు రౌండ్‌లలో తనదైన పంచ్‌లతో ప్రత్యర్థికి చెమటలు పట్టించింది. 50 కేజీల విభాగంలో పోటీ పడ్డ నిఖత్ జరీన్ తన ప్రత్యర్థి జెర్మనీకి చెందిన మాక్సీ క్లోట్జ్‌జర్‌పై రెఫరీల యునానిమస్ డిసిషన్ 5-0 తో నెగ్గింది. నిఖత్ జరిన్ మొదటి విజయం సాధించడం పట్ల జిల్లాకు చెందిన బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. నిఖత్ జరీన్ విజయం పరంపరా కొనసాగాలని కోరారు.

# అధ్వానమైన డ్రైనేజీలతో ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు


బీర్కూర్‌లో డ్రైన్ నిర్మాణం కోసం తవ్విన గోతిలో నిలిచిన వర్షం నీరు

బీర్కూర్, జూలై 28 : అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా పరిణమించింది. మిషన్ భగీరథ, రోడ్డు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బీర్కూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనులు ఎక్కడిక క్కడ నిలిచిపోయాయి. వర్షాల వల్ల రహదారిపై, డ్రైన్‌ల నిర్మాణం కోసం తవ్విన గోతిల్లో వర్షం నీరు నిలుస్తుంది. రహదారి కింద గల మంచినీటి పైపులైన్లలో మురికినీరు చేరి సరఫరా కావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరుమోటార్ల పైపుల్లో మురికి నీరు సరఫరా అవుతుంది. రహదారి విస్తరణ పనులు ఎందుకు నిలిపివేశారని స్థానిక ప్రజలు ఆర్‌అండ్‌బీ అధికారులను అడుగగా మిషన్ భగీరథ శాఖ అధికారులను అడగాలని, మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసి అడిగితే ఆర్ అండ్ బీ అధికారులను అడగండి అని చెప్పి తప్పించుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు



బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులు

● టైఫాయిడ్, చికున్‌గున్యా బారిన పడుతున్న ప్రజలు
● రోగులతో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు

బాన్సువాడ టౌన్, జూలై 28: వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. వేసవి తర్వాత వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా వర్షాలు కురియడం, వర్షపు నీరు నిల్వ ఉండడం, ఆ నీటిలో దోమలు ఆవాసాలను ఏర్పాటు చేసుకోవడం, ఇలా వివిధ కారణాల వల్ల ఈ కాలంలో వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. జగ్రత్తలు పాటించకపోతే ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియాలు పెరిగి వైరల్ ఫీవర్, ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉంది. ఈ సమయంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయి. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులు సోకడంతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట పీహెచ్‌సీ పరిధిలో గత కొన్ని రోజుల క్రితం అక్కడి ప్రజలు రోగాల బారిన పడి నానా అవస్థలు పడ్డారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు రోగులకు కావాల్సిన మందులు, వైద్యం అందించారు. అదేవిధంగా బోర్లం గ్రామంలో కూడా చికున్‌గున్యా వ్యాధి బారిన పడి మంచానికే పరిమితమయ్యారు.

**బాన్సువాడ ఆస్పత్రిలో..**

బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలో ఒక్క జూలై నెలలోనే ఇప్పటి వరకు స్త్రీలు 423 మంది, పురుషులు 250 మంది రోగులు సీజనల్ వ్యాధుల బారిన పడి చికిత్స పొందారు. వైద్యులు, సిబ్బంది రోగులకు అవసరమైన చికిత్సలు చేస్తూ మందులు అందిస్తున్నారు. ప్రతీ రోజు 12 నుంచి 15 మంది రోగులు చేరుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలుపుతున్నాయి.

**వ్యాధులు ప్రబలకుండా వైద్యుల సూచనలు**

- పరిసరాలను దోమలు వృద్ధి చెందకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమతెరలు వాడుకోవాలి.
- బయటి ఆహారం తీసుకోకుండా ఉండాలి.
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి.
- దగ్గు, జలుబు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- జ్వరం మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# నిధుల లేమి.. నిర్వహణ భారం

● మండల పరిషత్ కార్యాలయ పరిస్థితి


మద్నూర్ ఎంపీడీవో కార్యాలయం

మద్నూర్, జూలై 28 : గత ఐదేళ్ళలో నిధుల లేమితో మండల పరిషత్ కార్యాలయ నిర్వహణ భారంగా మారింది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాబోయే ఐదేళ్ళలో మండల పరిషత్‌లకు నిధులు కేటాయించి ఆదుకుంటారని ఆశా వాహులు ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లా మండల పరిషత్‌లు నిధులలేమితో సమస్యలను ఎదుర్కొన్నాయి. గడిచిన ఐదేళ్ళ కాలంలో వాటికి కేటాయించాల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రద్దు చేశాయి. దీంతో అభివృద్ధికి నోచుకోక పాలన పడకేసింది. గ్రామాల్లో పర్యటించినప్పుడు కళ్లెదుట సమస్యలు కనిపించిన తీర్చడానికి తగినన్ని నిధులు లేక అంతర్ మదనం చెందారు. ప్రతి పనికి ఎమ్మెల్యేలపై ఆధారపడాల్సి వచ్చింది. చాలా మంది ఎందుకు అయ్యామంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఐదేళ్ళలో జడ్పీటీసీ, ఎంపీపీలు నిధుల లేమితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**నిలిచిపోయిన నిధులు**

మండల పరిషత్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రకాల నిధులు మంజూరయ్యేవి. వాటితోనే పల్లెల్లో ప్రగతి పనులు చేపట్టేవారు. గతంలో ఒక్కో జడ్పీటీసీకి రూ. కోటి నుంచి 1.5 కోట్ల నిధులు మంజూరయ్యేవి. గత ఐదేళ్ళలో అరకొర జనరల్ ఫండ్ మినహాయించి ఇతర నిధులు ఏవి సక్రమంగా రాలేదు. కేంద్రం నుంచి వచ్చే జీఆర్‌జీఎఫ్ నిధులకు 2013లోనే మంగళం పాడారు. ఇక ఆర్థిక సంఘం నిధులు 50.30.20 నిష్పత్తి గ్రామ పంచాయితీలకు కేటాయించేవారు. కాని ఆర్థిక సంఘం నిధుల మొత్తాన్ని గ్రామ పంచాయితీలోకి నేరుగా ఇస్తున్నారు. ఎస్ఆర్‌ఈజీఎస్ నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకే పెత్తనం ఇచ్చింది. 2011లో జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్ పాలక వర్గాలు లేని సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో తీసుకువచ్చి ఎమ్మెల్యేలకు అధికారం కట్టబెట్టింది. అనంతరం కొత్త ప్రభుత్వాలు కొలువు దీరిన తరువాత జీవోను రద్దు చేయకపోవడంతో ఇప్పటికీ పాత విధానమే కొనసాగుతుంది. నిబంధనల ప్రకారం పనుల తీర్మానాలు చేసి ఇవ్వడమే పనిగా మారింది. ఎంఆర్ఆర్ నిధులను కూడా వీరికి ఇవ్వడం లేదు. ఎస్ఎఫ్‌సీ నిధులు మాత్రమే గడిచిన రెండేళ్లలో అరకొరగా అందినట్లు తెలుస్తోంది.

**అందరిలోనూ నిరాశే..**

గత ఐదేళ్ళలో ఒక్కో జడ్పీటీసీకి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు మించి నిధులు రాలేదని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇందులో సుమారు రూ.20 లక్షల వరకు ఉపాధిహామీ నిధులే ఉండటం గమనార్హం. 2019లో ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల్లో మెజారిటీ వర్గం అప్పటి అధికార పార్టీలో కొనసాగుతుండటంతో ప్రభుత్వాన్ని విమర్శించే సాహసం చేయలేదు. ఇక ఎంపీటీసీల పరిస్థితి చూస్తే వారికి పదవి ఉంది తప్ప నిధుల ప్రస్తావనే రాలేదు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కిసాన్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ముప్కాల్, జూలై28: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 2001-02సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 23ఏళ్ల తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకేచోట చేరి సందడి చేశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఇంతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగ రీత్యా 23ఏళ్ళ తర్వాత ఒకే చోట చేరడం ఆనందంగా ఉందన్నారు. తమకు చదువు నేర్పిన పాఠశాలలో తరగతి గదులు తిరిగి చిన్ననాటిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యబుద్ధులు నేర్పిన గురువులను విశ్వనాథ్‌రెడ్డి, లింబాన్న, తదితర గురువులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావాలి

ఏర్గట్ల, జూలై 28: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి కోరారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన పోషక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి తిథి భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ఓప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని ఎవరిదైనా జన్మదిన వేడుకలు, వివాహవేడుకలు జరుపుకున్నప్పుడు విద్యార్థులకు పండ్లు, స్వీట్స్, ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే తమకు ముందుగా సమాచారం అందించాలన్నారు.

## నిర్వాసితులకు ఆర్థిక సహాయం



మెండోరలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మెండోర, జూలై28: మండల కేంద్రానికి చెందిన గోలి అమ్మాయి, దేవాయి, నర్సు నివాసాలు ఇటీవల కురిసిన వర్షాలకు పాక్షికంగా దెబ్బతినడంతో వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.30వేలు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి వర్షాలకు దెబ్బతిన్న గోలి అమ్మాయి కుటుంబానికి 25కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ విషయాన్ని సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా వారికి ఆర్థిక సహాయం అందజేసి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహాయం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, కొప్పెల మోహన్, దేవరాజ్, మౌలాన,ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## సాబ్‌కా సాత్ సాబ్‌కా వికాస్ అనే నినాదం వట్టి బూటకమే : సీపీఎం

బోధన్‌రూరల్,జూలై28: బోధన్ పట్టణంలో ఆదివారం సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సాబ్‌కా సాత్ సాబ్‌కా వికాస్ అనే నినాదం వట్టి బూటకమేనని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రుజువు చేస్తుందని నిరూపించారు. కేవలం తన కుర్చీని కాపాడుకోవడానికి కేంద్రం చట్టప్రకారం అన్ని రాష్ట్రాలకు సమానమైన నిధులు కేటాయించడంలో వివక్షతను పాటించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు జరుపడంతో గత 10సంవత్సరాలు నిర్లక్ష్యం చేయడంతో పాటు ఇప్పటి బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించకపోవడం కేంద్రం వైఖరికి అద్దం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా అమలు జరుపడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పింఛన్‌లకు పెంపుగాని, మహిళలకు ఇస్తానన్న 2500రూపాయల నిధులు కేటాయించకపోవడం సరైంది కాదన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరిని తెరిపిస్తామని ఇచ్చిన హామీని ముందుగా బోధన్ నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీని ప్రారంభించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సీపీఎం స్వాగతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, కామ్రేడ్ బాలయ్య, గంగాధర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై కుంగిన కల్వర్టు

● గుమ్మిర్యాల్‌లో కుంగిన కల్వర్టు ● రాకపోకలకు అంతరాయం ● పట్టించుకోని అధికారులు



గుమ్మిర్యాల్‌లో కుంగిపోయిన కల్వర్టు



అధ్వాన్నంగా మారిన మెట్‌పల్లికి వెళ్లే రోడ్డు

ఏర్గట్ల, జూలై 28: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రోడ్లు కల్వర్టులు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వెళ్లే దారిలో రోడ్డు చెడిపోవడంతో రోడ్డుపై మొత్తం నీరు చేరి కొత్తగా వచ్చే ప్రయాణీకులు అగుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇట్టి విషయమై ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గుమ్మిర్యాల్ గ్రామంలో పొచ్చెరువుపై ఉన్న కల్వర్టు కుంగిపోయి రెండేళ్లు గడుస్తున్నా నేటికి మరమ్మతులు లేక ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామస్థులు కల్వర్టుపై మట్టిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ వర్షానికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపో యాయని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు చెప్పినా స్పందించడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

### కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

గ్రామంలోని పొచ్చెరవుపైన ఉన్న కల్వర్టు కుంగిపోయి రెండేళ్లవుతుంది. ఇప్పుడు వర్షాలు అధికంగా కురవడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కల్వర్టు మీద నుండే నిర్మల్‌తో పాటు అటు జగిత్యాల జిల్లాకు రాకపో కలు జరుతాయి. ఇట్టి విషయమై అధికారులకు విన్నవించినా పట్టిం చుకోవడం లేదు. పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలి.



బొల్లి శంకర్, మాజీ ఎంపీటీసీ గుమ్మిర్యాల్

# పెద్దమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు



ఆర్మూర్‌లో ఆలయంలో పూజలందుకున్న పెద్దమ్మతల్లి



వనభోజనాలకు గ్రామస్థులు

పెర్కిట్, జూలై28: ఆర్మూర్ పట్టణంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి జంతు బలి ఇచ్చి కోరిక కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. ఈ సంవత్సరం భక్తులకు ఏలాంటి ఆటంకాలు కలుగకుండా, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**● గ్రామాల్లో వనభోజనాల సందడి**

**ఆర్మూర్‌రూరల్:** ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం వనభోజనాల సందడి జరిగింది. గ్రామాల్లోని గ్రామదేవలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం గ్రామశివా రులో కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు చేశారు. వర్షాకాలం ప్రారంభమై గ్రామాల్లో గ్రామదేవతలకు జలాభిషేకం చేసి వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని మొక్కుకున్నారు. అషాడ మాసంలో చివరి ఆదివారం కావడంతో గ్రామప్రజలు వనభోజనాలకు వెళ్ళారు.

**● నల్ల పోచమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు**

ఆర్మూర్ పట్టణంలో నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఆషాడమాసంలో ఆదివారం కావడంతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుయకున్నారు. ఈ సందర్భంగా పలువురు మొక్కులో భాగంగా జంతు బలులు ఇచ్చారు. అదే విధంగా ఆర్మూర్ శివారులోని పెద్దమ్మతల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, పట్టణ ప్రజలు పెద్దమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

**నవీపేట:**మండలంలోని పలుగ్రామాలలో ఆదివారం వన భోజనాలు నిర్వహించారు.ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో నవీపేటతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గ్రామ దేవతలకు పూజలు చేశారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

## సైబర్ నేరగాళ్ల బెదిరింపు కాల్స్

ఆర్మూర్‌టౌన్, జూలై27: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే మహిళకు ఆదివారం సైబర్ నేరగాళ్లు డబ్బులు పంపాలని బెదిరింపు కాల్స్ చేశారని తెలిసింది. అంజలి వాళ్ళ నాన్న బెహరెన్ దేశంలో ఉంటూ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని, ఆయనను వదిలివేయాలంటే రూ.10వేల ఫోన్‌పే చేయాలని బెదిరించాడని ఆమె తెలిపింది. దీంతో జరిగిన సంఘటన విషయమై తన తండ్రి పెంటయ్యకు తెలపగా అలాంటి సంఘటన ఏమిలేదని తెలపడంతో సైబర్ నేరగాళ్ళ పని అని భావించారు. ఇలాంటి సంఘటన గతంలో అదే గ్రామానికి చెందిన ప్రవీన్ అనే వ్యక్తికి జరిగిందని, ముందు జాగ్రత్తగా పోలీసులకు సమాచారం అందించారు.

## గ్రామదేవతలకు గంగ నీళ్లతో జలాభిషేకాలు

జక్రాన్‌పల్లి, జూలై28: వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం గ్రామదేతలకు గంగనీళ్ళను వలగొడుగు వేసుకొని ఊరేగింపుగా వచ్చి గ్రామదేవతలకు గంగనీళ్ళతో జలాభిషేకం చేశారు. వివిధ గ్రామాల్లో పోచమ్మ ఆలయంలో గ్రామదేవతలకు ప్రజలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వనభోజనాలకు వెళ్ళారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల వీడీసీసభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



ఆచన్‌పల్లిలో బోనం ఎత్తిన మున్సిపల్ చైర్‌పర్సన్



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఏనుగు రవీందర్ రెడ్డి



మెండోరాలో మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్థులు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బోధన్‌రూరల్,జూలై28: ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో పట్టణంతో పాటు బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాలలో బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి నుండి బోనాలు తీసుకుని గ్రామ దేవతల ఆలయాలకు డప్పువాయిద్యాల మధ్య చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం నింపి చీర, సారెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

**వర్ని:** వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలో ఆదివారం బోనాలు, తీజ్ పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అఫందీఫారం, వకీల్ ఫారం, వివిధ గిరిజన తండాల ప్రజలు ఉత్సవాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డితో కలిసి సంబరాలు నిర్వహించారు. మేక వీర్రాజు, దశాగౌడ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని మండలంలో ఆదివారం వివిధ గ్రామాల్లో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వర్నిలోని వడ్డేపల్లి, జాకోర, పాత వర్ని, జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో బోనాల ఉత్సవాలు జరిగాయి. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావులు పాల్గొన్నారు.

**వర్ని:** చందూర్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

**భీమ్‌గల్‌రూరల్:** భీమ్‌గల్ మండలంలోని మెండోరా, పల్లికొండ, బాబాపూర్, పిప్రి, బడాభీమ్‌గల్, గోన్ గొప్పుల, తదితర గ్రామాలలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఆషాడ మాసం ఆదివారం పురష్కరించుకొని గ్రామం నలువైపులా ఉన్న గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. నైవేద్యాలు సమర్పించారు. పాడి పంటలు బాగుండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా వనభోజనాలలో పాల్గొన్నారు.

**రుద్రూరు:** తెలంగాణ ప్రజలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగలో బోనాల పండుగ ప్రత్యేకమైంది. ఆదివారం రుద్రూరు మండల కేంద్రంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిలు హాజరై బోనం ఎత్తుకుని భజా భజంత్రీలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఈకార్యక్రమాలలో బోధన్ మాజీ మున్సిపల్ చైర్మన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశా య్, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

**కోటగిరి:** కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగకు కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి ముఖ్య అతిథి హాజరయ్యారు. గ్రామస్థులతో కలిసి బోనాలు ఎత్తుకుని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్, భీమా సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముప్కాల్:**బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా బోనాల సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంపరదాయ దుస్తులు ధరించి గ్రామంలోని ప్రధాన వీధులగుండా సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి పోతరాజు విన్యాసాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం బాల్కొండలోని ఐదు పోచమ్మ దేవతలకు పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి బోనాలు ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పోతరాజుల విన్యాసాలు చేస్తూ స్థానికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు పాఠశాల డైరెక్టర్‌లు కోటగిరి భానుచందర్,ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ప్రతి యేటా ప్రతి ఆషాడ మాసంలో లో ఈ పండగా నిర్వహించడం ఆనవాయితిగా వస్తుందని గ్రామ ప్రతినిదులు పేర్కొన్నారు. భక్తులు పోచమ్మ బోనాలతో పాటు పలు నైవేద్యాలు, అమ్మవారికి సమర్పించారు. బోనాల పండగ సందర్భంగా గ్రామంలో పండగ వాతవరణం ఉట్టిపడింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు కాపాడాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, నాగర్జున, మధు, సురేశ్, గోపి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోస్రాలో ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోస్రా,జూలై28: మండలంలోని మోస్రా జిల్లా పరిషత్ పాఠశాల 2003-04 సంవత్సర విద్యార్థులు ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి కృతజ్ఞతలు తెలిపారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి విద్యార్థినిలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అందరికి తాను చేస్తున్న ఉద్యోగం కుటుంబ సభ్యులతో పరిచయం చేసుకున్నారు. భోజనం అనంతరం గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు.

## అపరిచిత కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలి

భీమ్‌గల్ రూరల్, జూలై28: సైబర్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అపరిచిత కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై హరిబాబు తెలిపారు. ఆదివారం భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లోన్‌యాప్స్‌ని నమ్మవద్దని, మీకులోన్ ఇచ్చి మీరు తిరిగి కట్టక పోయిన వేధింపులకు గురిచేస్తారని అన్నారు. మీకు తెలియని వాట్సాప్ నెంబర్ కానీ, ఫేస్‌బుక్‌లో వచ్చే అమెజాన్ గిఫ్ట్ కార్డు వంటి మోసపూరిత కార్డ్‌ని నమ్మవద్దని అన్నారు. కేవైసీ అప్ డేట్ చెయ్యమని కాల్స్ వస్తే నమ్మవద్దని అన్నారు.ఈకార్యక్రమంలో ఏఎస్సై తదితరులు పాల్గొన్నారు.

## గంగక్క మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



కమ్మర్‌పల్లిలో కామ్రేడ్ గంగక్క నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 28: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ సీనియర్ కార్యకర్త కామ్రేడ్ బేల్దారి గంగక్క మొదటివర్ధంతిని ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా నాయకులు సారసురేష్ మాట్లాడుతూ..గంగక్క మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఈలోటును ఎవరు పూడ్చలేనిదన్నారు. పార్టీకి ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న ఘటనలను గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో మాస్‌లైన్ మండల కార్యదర్శి అశోక్, సత్తెక్క, లక్ష్మీ, బాజన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మోకాన్‌పల్లిలో విద్యార్థి అదృశ్యం



అశోక్(ఫైల్)

నవీపేట,జూలై28: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్‌ఫారంకు చెందిన కోడూరి అశోక్ అనే 15సంత్సరాల విద్యార్థి అదృశ్యమయ్యాడని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అశోక్ ఈ నెల 27న పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. అశోక్‌తండ్రి తిరుపతి ఉపాధి నిమిత్తం గతంలో దుబాయ్ వెళ్లగా తల్లి జయ కూలీ పని చేస్తూ తన ఇద్దరు కుమారులను చదివిస్తుందని అన్నారు.గత సంవత్సరం తల్లి జయ హైదరాబాద్‌లో కూలీ పని చేయగా అశోక్ కాచిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి వరకు చదివాడని, ఇటీవల వారి కుటుంబం స్వగ్రామమైన అంజుమాన్‌ఫారంకు రావడంతో 10వ తరగతి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో చేర్పించడం జరిగిందని అన్నారు. తనకు ఇక్కడ చదవడం ఇష్టం లేదని తరుచుగా తన స్నేహితులకు చెప్పేవాడని శనివారం తన స్కూల్ బ్యాగును తోటి విద్యార్థులకు ఇచ్చి ఇంటి వెళ్లలేదని అన్నారు. ఆదివారం రోజున తల్లి జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం : మాజీ ఎమ్మెల్యే



ఎత్తొండ క్యాంప్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై28: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో ఆదివారం కూలిపోయిన, పాత ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బీఆర్ఎస్ నాయకులు నిరుపేదలకు ఇళ్లు ఇవ్వకుండా తమ కార్యకర్తలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన లబ్దిదారులు ఇళ్లు లేక వర్షానికి తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 10కె రన్‌లో మెడల్ సాధించిన వేల్పూర్‌వాసి



గుగ్గిలం అశోక్

వేల్పూర్, జూలై28: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన గుగ్గిలం అశోక 10కెరన్‌లో మెడల్ సాధించారు.రన్‌ఫర్‌రన్ అంబాసిటర్‌గా అశోక్ ఎంపికయ్యారు.ఈసందర్భంగా జరి గిన 10కె రన్‌లో మంచి ప్రతిభ కనబ రిచి అ శోక్ మెడల్ సాధించారు.ఈసందర్భంగా మెదక్ ఎంపీ రఘునంథన్‌రావు చేతుల మీదుగా గుగ్గిలం అశోక్ మెడల్ అందుకున్నారు.మెడల్ సాధించిన వేల్పూర్ ప్రజాప్రతిని ధులు, స్నే హితులు,హర్షం వ్యక్తం చేస్తూమరె న్నోవిజ యా లు సాధిస్తూ వేల్పూర్‌గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు.

## చికిత్స పొందుతూ హోంగార్డు మృతి



ముత్తెన్న (ఫైల్)

ముప్కాల్, జూలై28: వేల్పూర్ పోలీస్‌స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మెట్టు ముత్తెన్న(50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన ముత్తెన్న కుటుంబం ఆర్మూర్‌లో నివాసముంటుం ది.ఈనెల 8న ముత్తెన్నకు బీపీ పెరిగి మెదడులో నరాలు చిట్లిపోవడంతో నిజామాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన జరిగింది.అప్పటికే దాదాపు రూ.12లక్షల వరకు ఖర్చు కాగా ఆర్థిక భారంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆదివారం ఉదయం మరణించారు.మృతునికి భార్య,ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## ఘనంగా తీజ్ ఉత్సవాలు

బోధన్‌రూరల్,జూలై28: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈతీజ్ ఉత్సవంలో మహిళలు, పిల్లలు పెద్ద మొత్తంలో, గ్రామస్థులు, తండావాసులు సీఐ తదతరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పడకేసిన ప్రత్యేకపాలన!

● గ్రామాల్లో దోమల విజృంభణ ● కాలనీల్లో గడ్డి పొదలు, పిచ్చి మొక్కలతో కనిపించని మురికి కాలువ

● విషకీటకాలకు, పాములకు నిలయంగా మురికి కాలువలు ● పట్టించుకోని పాలకులు

రుద్రూరు, జూలై 28: పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. సమస్యలు ఎక్కడికక్కడ తీవ్రమవుతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రుద్రూరు మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పారిశుధ్యం పడకేయడంతో గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక పక్క వైద్యాధికారులు సీజనల్‌వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్యం కుంటుపడుతోంది. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీలు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సిన పాలకులు ఆయా గ్రామాలవైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాలువలు నిండిపోయి ఈగలు, దోమలకు అవాసాలుగా మారాయి. ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. దీంతో పల్లె ప్రజలు ఆసుపత్రుల్లో చేరి వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలిఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దోమల నివారణకు కనీస చర్యలు చేపట్టడం లేదని, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రత్యేక పాలనలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సమస్యలపై దృష్టి సారించడం లేదు. అసలే వర్షాకాలం అపరిశుభ్రత, ఆపై చీకటి పడితే చాలు ఏ వార్డులకెళ్ళినా దోమల మోత వినిపిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వర్షపు నీటిని సైతం దారి మళ్లించే ప్రయత్నాలు జరగడం లేదు. గత నాలుగురోజులుగా ముసురు అలుముకున్న గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**● విష కీటకాలు నిలయంగా మారిన మురికి కాలువ**

రుద్రూరు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురికి కాలువ గడ్డి, పొదలు, పిచ్చి మొక్కలతో కనిపించకుండ పోవడంతో విష కీటకాలు, పాములకు నిలయంగా మారిందని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. నివాసా ప్రాంతాలకు పక్కనే ఉన్న ఈ మురికి కాలువను శుభ్రం చేయకపోవడంతోనే విష కీటకాలు, పాములు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈకాలనీలో ప్రధానరహదారి వెంబడే ఉండటంతో ఎంతోమంది చిన్నారులు, వృద్ధులు నడుచుకుంటూ వెళుతుంటారని స్థానికవాసులు పేర్కొంటున్నారు. మురికి కాలువను శుభ్రం చేయకపోవడం వల్లే విషకీటకాలు, పాములు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

**● కానరాని దోమల నివారణ ఫాగింగ్**

గ్రామాల్లో దోమల బెడద ఎక్కువకావడంతో ప్రజలు అవస్థలు పడుతుంటే పట్టించుకోవాల్సిన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. శానిటేషన్‌లో భాగంగా దోమల నివారణ కోసం వీధులు, నివాసాల వెంట ఫాగింగ్ చేయాల్సి ఉంది. కానీ ఏ గ్రామంలో కూడా ఫాగింగ్ చేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేసి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గడ్డి పొదలు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న మురికి కాలువ



గడ్డి పొదలు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న మురికి కాలువ

### మురికి కాలువలను శుభ్రం చేయాలి

● నవీన్ యాదవ్, జవహర్‌నగర్ కాలనీ, రుద్రూరు

మురికి కాలువలో చెత్తాచెదారం, గడ్డిపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విష కీటకాలకు అవాసాలుగా మారింది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. మురికికాలువలో గడ్డి పెరిగిపోవడంతో మురికి కాలువ కనిపించకుండా పోయింది. వెంటనే అధికారులు మురికి కాలువను శుభ్రం చేయాలి.

### పకడ్బందీ చర్యలు చేపట్టాం

● సురేష్‌బాబు, ఎంపీడీవో, రుద్రూరు

మురికి కాలువలను శుభ్రం చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాం. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ, మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నాం. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఇప్పటికే పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. సాధ్యమైనంత వరకు గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

## ఆసుపత్రిలో పెరుగుతున్న రోగులు

● విష జ్వరాలతో ఆసుపత్రులకు వస్తున్న రోగులు

● వైద్యం చేసేందుకు బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కరువు



ఒకే మంచంపై ఇద్దరు రోగులు

బోధన్‌రూరల్, జూలై28: ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. వాంతులు, విరోచనలు, జ్వరాలతో బోధన్ ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. రోజుకు 50 మందికి పైగా ఇన్ పేషెంట్లుగా జాయిన్ అవుతున్నారు. పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, పాత బోధన్, గోశాల, చెక్కీక్యాంప్ తదితర ప్రాంతాల నుండే కాక వివిధ ప్రాంతాల నుండి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించడానికి ఆసుపత్రిలో సరైన వైద్యులు లేకపోవడంతో వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఆసుపత్రిలో రోగుల కోసం అదనపు బెడ్లు వేసినా వారికి పూర్తిస్థాయి వైద్యం అందడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆసుపత్రిలో ఒకేసారి నలుగురు వైద్యులు బదిలీ కావడంతో వారి స్థానంలో మరొకరు రాకపోవడంతో వైద్యుల కొరత ఏర్పడింది. ఇటీవల ప్రసూతి విభాగంలో ప్రసూతి వైద్యురాలు లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఒకే మంచంపై ఇద్దరు రోగులకు వైద్యం అందించే పరిస్థితి ఏర్పడింది. వైరల్ ఫీవర్‌తోపాటు డెంగ్యూ కేసులు సైతం నమోదు అవుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నియంత్రిం చే అధికారులు కరువయ్యారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఆసుపత్రిలో వైద్యులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. వైద్యులు లేకపోవడంతో ప్రజలు బారులు తీరి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడ వైద్య బృందాన్ని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

### వైద్యుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం

● డాక్టర్ సుమంత్, ఇన్‌చార్జి సూపరిండెంట్, బోధన్

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవం. ఇటీవల ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యులు బదిలీఅయ్యారు. వారిస్థానంలో వైద్యులు రావాల్సి ఉంది. వైద్యుల కొరతపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాను. త్వరలో బోధన్ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీరుతుంది. రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందేలా చర్యలు చేపడుతున్నాం.



ఎస్సారెస్పీ ప్రాజెక్టు

## ఎస్సారెస్పీకి 20వేల క్యూసెక్కుల వరద

మెండోర, జూలై28: ఉత్తర తెలంగాణ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 20 వేల 370 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మహరాష్ట్రలోని విష్ణుపూరి, బలేగాని ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన మిగులు జలాలు ప్రాజెక్టులోకి 20వేల 370 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా ఆదివారం సాయంత్రానికి 1075.00 అడుగులు (32.876 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టు ప్రాంతాల నుంచి 27 టీఎంసీల వరద నీరు వచ్చిందని తెలిపారు.

### రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

సుభాష్‌నగర్, జూలై 28: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభను చాటారు. జూలై 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రుత్విక గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రౌన్జ్ మెడల్స్ సాధించింది. సిద్ధార్థ గోల్డ్‌మెడల్, భవ్య, రాథోడ్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. జూనియర్ కేటగిరి విభాగంలో శ్రీనిధి, వినాయక్ రాథోడ్, వర్షినిలు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆగస్టు 1,2తేదీల్లో వైజాగ్‌లో జాతీయస్థాయి పోటీలో పాల్గొననున్నారని తైక్వాండో అసోసియేషన్ జిల్లాకార్యదర్శి మనోజ్‌కుమార్ తెలిపారు.



మెడల్స్‌తో క్రీడాకారులు

### ఆగస్టు 3 నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలు

సుభాష్‌నగర్, జూలై 28: రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలు ఆగస్టు 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు క్యాతం సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ మండలంలోని జెబిఎన్ గార్డెన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలో పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్ పురుషుల డబుల్స్ విభాగాలల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఆగస్టు 1 వరకు ప్రవేశ రుసుము చెల్లించాలని, మిగతా వివరాల కోసం 9440307023 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

**CHANGE OF NAME**

గంగవరం రాజ్యలక్ష్మి W/o గంగవరం రామశర్మ (పాతపేరు) R/o H.No. 11-1-46, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, కంఠేశ్వర్, నిజామాబాద్, తెలంగాణ నివాసిని. ప్రస్తుతము నాయొక్క పేరును చెరుకు రాజ్యలక్ష్మి W/o గంగవరం రామశర్మ (కొత్తపేరు) గా పరిగణించ గలరు.



రోడ్డుపై ఉన్న గుంతలు

## అడుగడుగునా గుంతలే!

● వాహనదారుల ప్రాణాలతో చెలగాటం

● ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం

మోస్రా, జూలై 28: బాన్సువాడ - నిజామాబాద్ రహదారిని నాలుగు లైన్ల ప్రధాన రహదారిగా వేసిన అధికారులు మండల కేంద్రంలోని రెండు వైపులా అధ్వానంగా ఉన్న రోడ్లను అలాగే వదిలేసి వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ మందిరం నుంచి స్థానిక పెట్రోల్ బంక్ అలీసాగర్ చౌరస్తా వరకు రోడ్డు పరిస్థితి గుంతలమయం మారింది. మోస్రా నుంచి బాన్సువాడ వెళ్లే దర్గా వద్ద నుంచి బోధన్ వెళ్లే చౌరస్తా వరకు ఇప్పటివరకు చాలా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా రోడ్డు రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**గుంతలు ఉన్నది నిజమే: జియాన్, ఏఈ, ఆర్‌అండ్‌బీ**

రోడ్డుపై గుంతలు ఉన్నది నిజమే. అయితే ఒకరు కాంట్రాక్టు చేసిన పనిని ఇంకొకరు చేయకపోవడం కారణంగా పరిస్థితి ఇలా ఉంది. సదరు కాంట్రాక్టుతో మాట్లాడి గుంతలు పూడ్చేలా చర్యలు చేపడతాం.



రోడ్డుపై ఉన్న గుంతలు

# విరామం ఇవ్వని వర్షం

● జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షం

నిజామాబాద్ అర్బన్, జూలై28: జిల్లాలో గత పది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా అంతటా కళకల సంతరించుకుంది. అల్పపీడన ప్రభావంతో ఆదివారం సైతం జిల్లాలో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉంటున్న ఆకాశం అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంటుంది. వరుసగా కురుస్తున్న చిరుజల్లులతో జిల్లా అంతటా వాగులు, వంకలు, చెరువులు వర్షం నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 3.68 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ధర్పల్లిలో 16.8 మిల్లీమీటర్లు, ఆర్మూర్‌లోని మగ్గిడిలో 15.8, కల్దుర్తిలో 15.3, నవీపేటలో 15.0, రెంజల్‌లో 14.8, తూంపల్లిలో 14.3, గన్నారంలో 14.0, మంచిప్పలో 13.8, చిన్నమావందిలో 13.3, బెల్లాల్‌లో 13.0, భీంగల్‌లో 13.0, జాన్కంపేట్‌లో 13.0, చీమన్‌పల్లిలో 13.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బంగాళఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ప్రభావం మరికొన్ని రోజులు ఉండే అవకాశం ఉంది.



దారి గుండా ఉన్న ముళ్ల పొదలను చూపుతున్న కాలనీవాసులు

### సారూ.. మాకు నడిచేందుకు దారేది?

● కాలనీవాసుల ఆవేదన

మోస్రా, జూలై28: మండల కేంద్రంలో గల పిట్ల గంగాధర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఇళ్లవద్ద నల్లా బిగించకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటికి దూరంగా బిగించింది. అయితే కనీసం నీరు పట్టుకునేందుకు వెళ్లడానికి దారి కూడా లేదని, దారి గుండా అన్నీ ముళ్లపొదలతో నిండి ఉండడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కదారికూడా సరిగ్గా లేదని, మొత్తం ముళ్లకంపలతో బురదమయంగా ఉందని, తమ సమస్యను పరిష్కారించాలని కాలనీవాసులు చేయాలని కోరుతున్నారు.

### సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

డిచ్‌పల్లి, జూలై 28: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు జాగ్రత్తగా ఉండాలని మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ సూచించారు. ఆదివారం సుద్దపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాదులు సంక్రమణ, వాటి నివారణపై అవగాహన కల్పించారు.



## చికెన్ ధరలు

| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.100 | రూ.220 | రూ. 240 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.105 | రూ.225 | రూ. 245 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.72,000 | రూ.66,400 | రూ.870 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

- స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
  : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)
- స్క్రీన్-2 : కల్కి (3డీ తెలుగు) (11.20, 6.15)
  : రాయాన్ (3.05, 10.00)
- స్క్రీన్-3 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.00, 4.15, 10.30)
  : పురుషోత్తముడు (1.05)
  : ఆపరేషన్ రావన్ (7.20)
- స్క్రీన్-4 : రామ్ ఎన్‌ఆర్‌ఐ (10.10)
  : గల్లీ గ్యాంగ్ స్టార్స్ (1.00)
  : ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20)
  : రాయన్ (7.10)
  : పురుషోత్తముడు (10.20)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

- స్క్రీన్-1 : రాయన్ (10.45, 1.35, 4.30, 7.25, 10.20)
- స్క్రీన్-2 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (1.40, 7.30)
  : కల్కి (తెలుగు) (4.15, 10.20)
- స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.40, 10.40)
  : కల్కి (1.20, 7.20)
  : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.45)

- దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్

# గిరిజన తండాల్లో ఘనంగా తీజ్ వేడుకలు



గోధుమ బుట్టలతో గిరిజన మహిళలు



నృత్యాలు చేస్తున్న మహిళలు

ఇందల్వాయి, జూలై 28: ఇందల్వాయి మండలంలోని మేగ్యానాయక్ తండా, దేవితండా, ఎత్తు తండా, పలుగుతండా, గుడితండాలలో ఆదివారం గిరిజనుల సాంప్రదాయమైన తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల నుంచి పెళ్లికాని మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ నీరు పోసి పెంచిన గోదుమ బుట్టలను తలపై పెట్టుకొని వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజనుల సాంప్రదాయం ప్రకారం పెళ్లికాని మహిళలు గోధుమ బుట్టలను పెంచితే ఎవరి విత్తనాలు ఏపుగా పెరుగుతాయో వారి జీవితం పెళ్లైన తర్వాత సాఫీగా సాగుతుందని గిరిజనుల నమ్మకం. తీజ్ వేడుకల సందర్భంగా డీజే చప్పుళ్ల మధ్య మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం తండాల్లో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పాడిపంటలు బాగా పండాలని పిల్లలు, పశుసంపద సమృద్ధిగా ఉండాలని ఈ వేడుకలు నిర్వహిస్తామని తండా పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండా పెద్దలు సర్దార్ నాయక్, రాములు నాయక్, రెడ్డినాయక్, వెంకట్రాంనాయక్, దేవిదాస్ నాయక్, మాజీ ఎంపీటీసీ అనుహన్సన్, ఉదయ్ నాయక్, చందర్, పరుశురాం, అంబర్‌సింగ్, తదితరులు ఉన్నారు.